క్లుప్తంగా

కూడలి తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలన



నందిగామ: శివరాత్రి సమీపిస్తున్న నేపథ్యంలో నందిగామ మండలం దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి వారి తిరునాళ్ల ఏర్పాట్లను పట్టణ ఎస్‌ఐ హనీష్ సోమవారం పరిశీలించారు. తిరునాళ్ల ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరునాళ్ల ఏర్పాట్లకు సంబంధించి దేవాదాయశాఖ అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా తిరుణాళ్లకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బంది లేకుండా వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలుపగా, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలో పారిశుద్ధ్యంపై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మురుగు కాలువల్లో జేసీబీ, కూలీల సాయంతో పూడిక తీయించడంతో పాటు బ్లీచింగ్ చల్లించారు. ఆయా పనులను సర్పంచి బి.జ్యోతిబ్రహ్మం పర్యవేక్షించారు. ఈసందర్భంగా సర్పంచి జ్యోతి మాట్లాడుతూ పారిశుద్ధ్యం విషయంలో గ్రామస్తులు కూడా సహకరించాలని కోరారు.

ప్రారంభమైన సువార్త మహాసభలు



నందిగామ: పట్టణ శివారు పల్లగిరిగుట్ట వద్ద గల క్రీస్తుసంఘం ఆవరణలో మూడు రోజుల పాటు జరిగే క్రీస్తు సువార్త మహాసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతోపాటు పలువురు దైవసేవకులు ప్రసంగించారు. సాయంత్రం సమయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిర్వాహకులు కోట శామ్యూల్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో దైవసేవకులు వి. ప్రసాదరావు, సంజీవరావు, నారాయణ, మోషే, ఇజ్రాయిల్, విశ్వాసకులు పాల్గొన్నారు.

ముక్త్యాల వీఆర్వో కోటయ్య మృతి





ముక్త్యాల(జగ్గయ్యపేట): మండలంలోని ముక్త్యాల గ్రామ వీఆర్వో కందుకూరు కోటయ్య (58) గుండెపోటుతో మృతి చెందారు. కోటయ్యకు ఆదివారం మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఆయన్ను వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కోటయ్య మృతదేహాన్ని ఆయన స్వగ్రామం అన్నవరం తరలించగా, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, వీఆర్వోల సంఘ నాయకులు సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఆర్బీకేల్లో ముసాయిదా జాబితాల ప్రదర్శన

వీరులపాడు:రబీ సీజన్–2023కి సంబంధించి ఈ–క్రాప్ ముసాయిదా జాబితాపై సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి జోగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ముసాయిదా జాబితాలను ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. రైతులు జాబితాలోని వివరాలను పరిశీలించి, మార్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులంతా ముసాయిదా జాబితాలని తమ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థికి అభినందనలు



జగ్గయ్యపేట అర్బన్ : యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ వారు సంయుక్తంగా నిర్వహించిన మండల స్థాయి పదోతరగతి టాలెంట్ టెస్ట్‌లో స్థానిక నాగార్జున హైస్కూల్ విద్యార్థి బి.రాహుల్ ద్వితీయ బహుమతి సాధించాడు. నాగార్జున హైస్కూల్‌లో సోమవారం రాహుల్‌కు అభినందన సభ నిర్వహించారు. జేఆర్సీ విద్యాసంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, కరస్పాండెంట్ పెనుగొండ రాజీవ్, జేఆర్సీ కళాశాల ప్రిన్సిపాల్ అబ్బులు, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరావు, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు మన్నె కృష్ణయ్య పాల్గొని రాహుల్‌ను అభినందించారు.

ప్రగతిపథంలో వెలదికొత్తపాలెం

- రూ 7.48కోట్లతో అభివృద్ధి పనులు..
- మెరుగుపడిన మౌలిక వసతులు
- మారిన పాఠశాలల రూపురేఖలు
- పథకాల ద్వారా గ్రామస్తులకు రూ.40కోట్లు
- సీఎం జగనన్న పాలనలో మారిన ఊరు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఇది కదా.. అభివృద్ధి

చందర్లపాడు(నందిగామ టౌన్): మండలంలోని వెలదికొత్తపాలెం గ్రామం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు వెలది కొత్తపాలెం గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న వెలదికొత్తపాలెంలో



వెలది కొత్తపాలెంలో నిర్మించిన సచివాలయ భవనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పదినెలల కాలంలో మౌలికవసతులు మెరుగుపడటంతో పాటు గ్రామం అభివృద్ధిపథంలో పయనిస్తోందంటూ గ్రామస్తుల హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రూ.1.55కోట్లతో భవనాలు.. సీసీ రోడ్ల నిర్మాణం..

వెలదికొత్తపాలెం జనాభా సుమారు 4500 ఉంటుంది. ప్రజల ముంగిటకే పరిపాలనను తీసుకురావాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామంలో రూ.40లక్షలతో సచివాలయ భవనం నిర్మించింది. రూ.21.8లక్షలతో రైతుల కోసం రైతుభరోసా కేంద్రం, రూ.18లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించింది. గ్రామంలోని అంతర్గత రోడ్లను రూ.60లక్షలతో సిమెంటురోడ్లుగా అభివృద్ధి చేయడంతోపాటు రూ.15లక్షలతో ఆయా రోడ్లకు ఇరువైపులా డ్రెయిన్లు నిర్మించి మురుగునీటి పారుదల సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలో మౌలికవసతులు మెరుగుపడ్డాయి.

రూ1.80కోట్లతో ఇంటింటికీ కొళాయి..

జలజీవన్ మిషన్ పథకం కింద రూ.1.80 కోట్లతో గ్రామంలోని ఇంటింటికీ మంచినీటి కుళాయి పనులు చేపట్టారు. మంచినీటి ఎవ్వరూ ఇబ్బందిపడకుండా నేరుగా కొళాయిల ద్వారానే నీటిని సరఫరా చేసేందుకు వీలుగా పనులు చేస్తున్నారు. త్వరలోనే ఈ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా రూ.18లక్షలతో ఎద్దువాగుపై కల్వర్టు నిర్మాణం చేపట్టారు. కల్వర్టు నిర్మాణంతో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు చెబుతున్నారు.

పాఠశాలలకు రూ.1.95 కోట్లు..

నాడు–నేడు పథకం కింద వెలదికొత్తపాలెంలోని రెండు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేసి రూ.25లక్షలతో ఆయా పాఠశాలలను అభివృద్ధి చేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.1.70కోట్లు కేటాయించారు. ఈ నిధులతో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, నీటిసరఫరా, మంచినీటి వసతి, విద్యార్థుల కోసం తరగతి గదుల్లో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా వసతులు కల్పించారు. దీంతో ఆయా పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. అదేవిధంగా డిజిటల్ విద్యలో భాగంగా డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

డీబీటీ ద్వారా గ్రామస్తులకు రూ.40కోట్లు..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న ఆయా సంక్షేమ పథకాల ద్వారా వెలదికొత్తపాలెంలోని గ్రామస్తులకు సుమారు రూ.40కోట్ల మేర లబ్ధి చేకూరింది. 25పథకాల ద్వారా డీబీటీ పద్ధతిలో ఇప్పటివరకు గ్రామంలోని 8,369మంది లబ్ధిదారులకు రూ.39.06కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయగా, ఏడు పథకాల ద్వారా నాన్ డీబీటీ పద్ధతిలో 2,326మంది లబ్ధిదారులకు రూ. 93.42లక్షల మేర లబ్ధి చేకూరింది. ఇలా మొత్తం 10,695 మంది లబ్ధిదారులకు సీఎం జగనన్న పాలనలో రూ.40కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఆయా సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికసాయం అందడంతో మా జీవితాలు ఎంతో మెరుగుపడ్డాయంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇలా రూ.7కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు సంక్షేమ పథకాల ద్వారా మరో 40కోట్లు అందించినందున అభివృద్ధి, సంక్షేమంలో వెలది కొత్తపాలెం ప్రగతిపథంలో దూసుకుపోతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహనరావు కృషి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధిలో తమ ఊరు మారిందంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.2కోట్లు ...

నవరత్నాలు పథకం కింద గ్రామంలోని 120మందికి పేదలకు జగనన్న కాలనీల్లో ఉచితంగా ఇళ్లస్థలాలు మంజూరు చేశారు. వీరు పక్కా గృహాలు నిర్మించుకునేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇళ్లను కూడా మంజూరు చేసింది. ఇందుకోసం ఇప్పటికే 72మంది ఇళ్లనిర్మాణాలు పూర్తిచేసుకున్నారు. వీరందరికీ కలిపి గృహనిర్మాణం కోసం మొత్తం రూ.2కోట్లను ప్రభుత్వం అందజేసింది. మిగిలిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

అండగా సంక్షేమ పథకాలు..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటినుంచి సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా నిలిచారు. ముఖ్యంగా కరోనా సమయంలోనూ సీఎం జగనన్న, పేదలకు ప్రభుత్వ పథకాలు అందించి ఇచ్చినమాట నిలబెట్టుకున్నారు. సంక్షేమ పథకాల లబ్ధితో మా జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.

– సీహెచ్ రమాదేవి, గృహిణి

టీడీపీ హయాంలో నిధులు ఇవ్వలేదు..



నేను గతంలో టీడీపీ తరఫున సర్పంచిగా పనిచేశాను. నా హయాంలో అభివృద్ధి చేద్దామన్నా నిధులు లేక చేయలేకపోయాను. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. గతంలో ఎన్నడూలేని విధంగా గ్రామం అభివృద్ధి చెందుతోంది. సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలన్నీ ఒకేచోట ఏర్పాటు చేయడం గ్రామానికే కొత్తకళ వచ్చింది.

– గుడిశ గోపయ్య, మాజీసర్పంచి

మునుపెన్నడూలేని అభివృద్ధి..



గ్రామం గతానికి భిన్నంగా అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. ముఖ్యంగా కనీసవసతులు లేని స్థాయినుంచి నేడు పట్టణానికి దీటుగా గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌తోపాటు ప్రజలకు అవసరమైన అన్నివసతులు కల్పించారు.

– చింతోటి శ్రీలత, సర్పంచి



రైతుభరోసా కేంద్రం



కార్పొరేట్ స్థాయిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల



గ్రామంలోని జగనన్నకాలనీ



ఎస్సీకాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

కేతవీరునిపాడు–కంచల రోడ్డుకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌలికవసతులు కల్పిస్తూ గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. రూ.20లక్షలతో చేపట్టిన మండలంలోని కేతవీరునిపాడు–కంచల గ్రావెల్‌రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ రాజ్యసభసభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ నిధులు రూ.20లక్షలతో రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీరు, డ్రెయిన్లతో పాటు ప్రజలకు అవసరమైన అన్నివసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన రాజ్యసభ ఎంపీ రవీంద్ర కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, రామిరెడ్డి సీతయ్య, చలమల మధుసూదనరావు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫైర్ ఆఫీసర్‌గా మురళీకృష్ణ సేవలు స్ఫూర్తిదాయకం



ఫైర్ ఆఫీసర్ మురళీకృష్ణను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఫైర్ స్టేషన్ అధికారిగా మురళీకృష్ణ అందించిన సేవలు స్ఫూర్తిదాయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కొనియాడారు. స్థానిక ఫైర్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ఫైర్ ఆఫీసర్ తోట మురళీకృష్ణ పదవీ విరమణ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫైర్ ఆఫీసర్ మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ అగ్నిమాపకశాఖ ఉద్యోగిగా 37 ఏళ్ల సర్వీసులో మురళీకృష్ణ అత్యుత్తమ సేవలు అందించారన్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన ఉద్యోగులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఫైర్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ప్రభుత్వ భవనాలు



సచివాలయ భవనం



రైతు భరోసా కేంద్రం



సొసైటీ భవనం

మంగొల్లు(వత్సవాయి): మండలంలోని మంగొల్లులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం చేపట్టిన గ్రామసచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాల పనులు పూర్తయి ప్రారంభోత్సవాలకు ముస్తాబయ్యాయి. మంగొల్లులో రూ.43లక్షలతో సచివాలయ భవనం, రూ.23 లక్షలతో రైతుభరోసా కేంద్రంతోపాటు మరో రూ.36 లక్షలతో సొసైటీ భవనం నిర్మించారు. చుట్టూ ప్రహరీ నిర్మాణం చేశారు. ఈ భవనాలను ఈనెల 7వతేదీన జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

నాడు–నేడు పనులపై హెచ్‌ఎంలతో సమీక్ష



మాట్లాడుతున్న ఏపీసీ ఉమామహేశ్వరరావు

చిల్లకల్లు (జగ్గయ్యపేట): నాడు–నేడు కింద రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తోందని, ఈ పనుల్లో అలసత్వం వహించొద్దని సమగ్ర శిక్ష ఏపీసీ జి.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నాడు–నేడు పథకం పనులపై సోమవారం ఆయన సమీక్షసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలికవసతుల కల్పనకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టిందన్నారు.
కొన్ని పాఠశాలల్లో పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయని, ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు చేపట్టి ఆయా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.నాడు–నేడు పనులను ఎంఈవోలు కూడా ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అనంతరం పాఠశాలల పనితీరును సమీక్షించారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట ఎంఈఓలు రవీందర్, నాగరాజు చిట్టిబాబు, నియోజకవర్గంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



వేదాద్రిలో కవాతు చేస్తున్న పోలీసులు



నందిగామలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జగ్గయ్యపేట: త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో విజయవాడ సీపీ ఆదేశాల మేరకు పేట మండలంలోని వేదాద్రి, బండిపాలెం, గౌరవరం గ్రామాల్లో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పోలీసులు, సాయుధ బలగాలు కలియ తిరిగారు. ఇన్‌చార్జి సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు కవాతు చేశారన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకునేలా వారికి ధైర్యం కల్పించేందుకే కవాతు నిర్వహించినట్లు వివరించారు. ఎస్‌ఐలు సతీష్, రాంబాబు, అభిమన్యు, సిబ్బంది పాల్గొన్నారు. **నందిగామ పట్టణంలో..**
నందిగామ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం నందిగామ పట్టణంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఏసీపీ బి.రవికిరణ్ నేతృత్వంలో స్థానిక పోలీసులు, ప్రత్యేక బలగాల పోలీసులు కలిసి పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతిఒక్కరిలో మనోధైర్యాన్ని నింపేందుకు ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ఎస్‌ఐ హనీష్ పాల్గొన్నారు.

చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలి



కంచికచర్ల : ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పకుండా పోలియో చుక్కలు వేయించి వారి నిండు జీవితానికి భరోసా కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు సూచించారు. కంచికచర్ల మండలం పరిటాల శివారు దొనబండ రాతి క్వారీల్లో పనిచేసే కార్మికులతో సోమవారం ఆయన మాట్లాడారు. వారి పిల్లలకు పోలియో చుక్కలు వేశారా? లేదా? అని ఆరా తీశారు. ఈసందర్భంగా జేడీ అర్జునరావు మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు కె.మధురిమ, లాబ్ టెక్నీషియన్ టి.శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనలో 13 అర్జీలు



నందిగామ: ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన ఎంతగానో ఉపయోగపడుతోందని ఆర్డీవో ఎ.రవీంద్రరావు అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ 13 మంది అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవీంద్రరావు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోరుతూ ఏడు అర్జీలు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి రెండు అర్జీలు, పోలీసు, సివిల్‌సప్లయిస్, మున్సిపల్, గృహనిర్మాణశాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ అందినట్లు వివరించారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): నవరత్నాలు పథకంలో భాగంగా పేదలకు అందించిన ఇళ్లస్థలాలకు సంబంధించిన పట్టాల రిజిస్ట్రేషన్ శరవేగంగా సాగుతోంది. మండలంలోని సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు, రెవిన్యూ సిబ్బంది ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మండ్లపాడు గ్రామ సచివాలయంలో సోమవారం 35 మంది లబ్ధిదారుల ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, ఉపసర్పంచి గుత్తా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి నరేష్, వీఆర్‌ఓ సుధశ్రీ, గ్రామనాయకులు కూచి విష్ణు, గూడపాటి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

రూ.72వేలు ఆర్థిక సాయం



వత్సవాయి : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండల విద్యాశాఖ కార్యాలయంలో అటెండర్ షేక్ జానీకి మండలంలోని ఉపాధ్యాయులు ఆర్థికంగా అండగా నిలిచారు. జానీ అనారోగ్య విషయాన్ని తెలుసుకున్న ఎంఈవో ఎల్.నాగరాజు తనవంతుగా ఆర్థికసాయం అందించడంతోపాటు విషయాన్ని మండలంలోని ఉపాధ్యాయులకు తెలియజేశారు. దీంతో ఉపాధ్యాయులంతా కలిసి రూ.72వేలను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ మొత్తాన్ని బ్యాంకు చెక్కురూపంలో జిల్లా ఏపీసీ గుడ్ల మహేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో అటెండర్ జానీకి అందజేశారు. అటెండర్ జానీ, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నాడు–నేడు పథకం కింద జగ్గయ్యపేటలోని పలు పాఠశాలల్లో సుమారు రూ.1కోటి వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఉదయభాను మంగళవారం ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక నాగమయ్య బజారులో ఎంపీయూపీ స్కూల్, మిట్టగూడెంలోని ఉర్దూ స్కూల్, జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్, కాకానినగర్‌లోని ఎంపీపీ స్కూల్, సీతారామపురం ఎంపీపీ స్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులు, ఇతర మౌలికవసతుల పనులను ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభిస్తారని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com